క్లుప్తంగా

సేఫ్ ఫార్మా కంపెనీపై కేసు నమోదు

ముప్పాళ్ల: సేఫ్ ఫార్మా కంపెనీ నిర్వాహకులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు శనివారం తెలిపారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిడుగురాళ్ల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి సాంబశివరావు ఈ ఏడాది మేలో వార్షిక తనిఖీల్లో భాగంగా బిల్లులు పరిశీలిస్తుండగా సేఫ్ ఫార్మా కంపెనీ నిషేధిత ఆక్సీకోడాన్ మందును కొనుగోలు చేసినట్లుగా గుర్తించారు. ఆ మేర వేర్‌హౌస్‌లో తనిఖీలు నిర్వహించగా సుమారు మూడు కిలోల నిల్వ దొరికింది. దాన్ని స్వాధీనం చేసుకుని కోర్టు ఆదేశాల మేర సేఫ్ ఫార్మా కంపెనీపై ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఇమామ్ తెలిపారు. సత్తెనపల్లి రూరల్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు విచారణ చేపట్టారు.

తహసీల్దార్ సురేష్‌కు సత్కారం



సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.సురేష్‌ను సత్తెనపల్లి ఏపీ.ఎన్జీవోస్ అధ్యక్షుడు పెండెం మణిరావు, కార్యవర్గ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రెజరర్ కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ అంబేడ్కర్, వెస్లీ, ఇబ్రహీం, ఖాసీం, చంద్రకాంత్, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రవిచంద్ర, వీఆర్వో వంశీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు



సత్తెనపల్లి: అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్ హెచ్చరించారు. మండలంలోని పాకాలపాడులో సర్వే నంబర్– 327లో అక్రమంగా మట్టి తవ్వకంపై శనివారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి, వివరాలు సేకరించారు. అనుమతులకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతుంటే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ పోలీసులకు సూచించారు. ఆయనతో పాటు ఏఎస్‌ఐ కరీముల్లా, గ్రామ రెవెన్యూ అధికారి వీరనరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివపార్వతి, గ్రామ సర్వేయర్స్ త్రివేణి, గ్రామ మహిళా పోలీసు సౌజన్య ఉన్నారు.

ఆలయ ముఖ ద్వార నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి



సత్తెనపల్లి: పట్టణంలోని 24వ వార్డులో గల తేనె అంకమ్మ తల్లి దేవస్థానం ముఖ ద్వారం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని పట్టణ వడ్డెర సంఘీయులు, దేవస్థాన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మిని మున్సిపల్ కార్యాలయంలో కలసి వినతి పత్రం అందించారు. అనుమతుల వస్తే వెంటనే పనులు చేపడతామని కమిటీ సభ్యులు తెలిపారు.

దిశ యాప్ మహిళల చేతిలో ఆయుధం



సత్తెనపల్లి: దిశ యాప్ మహిళలకు ఆయుధం లాంటిదని సత్తెనపల్లి టౌన్ సీఐ యు. శోభన్ బాబు అన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు దిశా యాప్‌పై పట్టణంలోని మహిళలకు, వివిధ కళాశాలల్లోని విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లో వెయ్యి మందికి పైగా మహిళలతో యాప్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల భద్రతకు, రక్షణకు దిశ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఒంటరిగా ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించేవారు ట్రాక్ మై ట్రావెల్ అనే ఆప్షన్‌ను ఉపయోగించుకుంటే వారు వెళ్లే రూటును ట్రాక్ చేస్తామని తెలిపారు. వాహనం సరైన మార్గంలో వెళ్లని పక్షంలో వెంటనే సంబంధిత ప్రాంత పోలీసుల్ని అప్రమత్తం చేస్తుందని వివరించారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరితో ఈ దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, రిజిస్ట్రేషన్ చేసుకుని ఆపద సమయంలో వినియోగించుకునేలా చూడాలని సిబ్బందికి చెప్పారు.



ఎరువుల కోసం క్రోసూరు ప్రాథమిక సహకార సొసైటీ వద్ద తిప్పలు పడుతున్న రైతులు (2016)



ఆర్బీకే వద్ద సబ్సిడీ విత్తనాలు తీసుకొంటున్న రైతులు

నాడు నేడు

వ్యవసాయం దండగ అని చంద్రబాబు ప్రభుత్వం రైతుల్ని పక్కన పెట్టటమే కాకుండా ఎరువులు కోసం ఎక్కడో ఉన్న మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి పరుగులు తీయాల్సి వచ్చేది. రైతులు గంటల తరబడి క్యూలో నిలబడేవారు. కొన్నిచోట్ల నిల్చునే ఓపిక లేక చెప్పులైనా క్యూలో పెట్టేవాళ్లు. ఇక ఎరువులైతే బంగారమే. వాటి కోసం వెళ్లి ఎన్నోసార్లు తొక్కిసలాటలో నలిగిపోయి, పోలీసులతో లాఠీ దెబ్బలు తిని రైతులు నానా కష్టాలు పడేవాళ్లు. దీంతో వ్యవసాయం వదిలేసి ఎందరో కూలీలుగా మారిపోయారు.

వ్యవసాయం పండగ అంటూ జగనన్న ప్రభుత్వం రైతుల్ని రాజును చేసింది. రువులైనా, విత్తనాలైనా వారి ముంగిట్లోనే అందిస్తుంది.అందుకోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది.అధికారుల్ని నియమించింది. ముందుగా నమోదు చేసుకునే విధానం ప్రవేశపెట్టింది. మండల కేంద్రానికి వెళ్లకుండా, గంటల తరబడి నిలబడి క్యూలో నిలబడకుండా అన్నింటినీ క్రమ పద్ధతిలో గ్రామంలోనే అందే విధంగా ఏర్పాటు చేసింది.సబ్సిడీపై ఆధునిక యంత్ర పరికరాల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో గతంలో కూలీలుగా మారిన రైతులందరూ నూతనోత్సాహంతో పొలంబాట పట్టారు.

నాడు వ్యవసాయం దండగ–నేడు పండగ

- వ్యవసాయానికి జగనన్న భరోసా
- రైతు ముంగిట్లో విత్తనాలు, ఎరువులు, పనిముట్లు
- సాగుకు అన్ని రకాల సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాలు

క్రోసూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల్ని రాజుల్ని చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించింది. పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, అమరావతి ,రాజుపాలెం మండలాలున్నాయి. వీటిలో ఈ ఏడాది రైతులకు ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాల్ని రైతులకు సబ్సిడీపై అందిస్తోంది. ఐదు మండలాలకు కలిపి జీలుగపై రూ.14,32,660, జనుముపై రూ. 13,83,900, పిల్లిపెసరపై రూ.10,37,900 రాయితీ ఇచ్చింది. సబ్సిడీ పోనూ పిల్లిపెసర కిలో రూ.48.50 , జనుము కిలో రూ.42, జీలుగ రూ.139.50కు అందిస్తోంది.

సబ్సిడీపై గత ఏడాది ట్రాక్టర్, రొటేవేటర్ అందుకున్నా..



జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత చిన్న రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. కస్టం హైరింగ్ గ్రూపులు ఏర్పాటు చేసి చిన్న రైతులకు సబ్సిడీ పై ట్రాక్టర్, రొటేవేటర్ ఇస్తున్నారు. నాకు కూడా రూ.6లక్షలు విలువైన ట్రాక్టర్, రూ.1.50 లక్ష విలువైన రొటేవేటర్ ఇచ్చారు. అవి వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– తిప్పిరెడ్డి కాశిరెడ్డి, రైతు, క్రోసూరు

తిప్పలు తప్పాయి



గతంలో సబ్సిడీ విత్తనాలు కావాలంటే మండల కేంద్రమైన క్రోసూరు వ్యవసాయకార్యాలయానికి వేకువజామున వెళ్లి క్యూలో నిలుచుకునే వాళ్లం. తీరా కావాల్సిన విత్తనాలు దొరికేవి కావు. ప్రస్తుతం అటువంటి సమస్యలు లేవు. మా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం పెట్టి అందులోనే రైతుల పనులన్నీ చేసి పెడుతున్నారు. విత్తనాలు, ఎరువులు, ఈకేవైసీ, పంట విక్రయాలు అన్నీ అందుబాటులోకి వచ్చాయి.

– షేక్‌బాబు, రైతు, క్రోసూరు

ముప్పాళ్ల జెడ్పీ హైస్కూలుకు అదనపు హంగులు

- పూర్వ విద్యార్థుల సహకారంతో పలు వసతులు
- రూ.20లక్షలతో కాన్ఫరెన్స్ హాలు, అదనపు తరగతి గది నిర్మాణం

ముప్పాళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ హాలు, తరగతి గది నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. శనివారం గది శ్లాబు చేపట్టారు. సుమారు రూ.20లక్షలతో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మారూరి రామలింగారెడ్డి మాస్టారు ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ హాలు, అదనపు తరగతిగది నిర్మాణ పనులు చేపట్టారు. 1952 నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో చదువుకున్న వారంతా సంఘంగా ఏర్పడి నిర్మాణ పనులు చేపట్టినట్లు ట్రెజరర్ ఏ.ఈశ్వరరెడ్డి తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పనే ప్రధానంగా పూర్వ విద్యార్థుల సంఘం పని చేస్తోందని చెప్పారు. త్వరలో జరగబోయే 75సంవత్సరాల వేడుకలకు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా ఈ సత్సంకల్పంలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఆయా గ్రామాల్లో ఉన్నవారితో పాటుగా, వేరే ప్రాంతాల్లో ఉన్న వారిని సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేసేందుకు గాను వారి వివరాలను 9966068116 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు.



శ్లాబ్ పనులు పర్యవేక్షిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

ఎస్సీ, బీసీ కాలనీల్లో విద్యుత్ లైన్ ఏర్పాటుకు అంచనాలు

- గతంలో మెయిన్ లైన్ ఇళ్ల మీదుగా ఉండటంతో ప్రమాదాలు
- ఎమ్మెల్యే నంబూరు శంకరావు ఆదేశాలతో అంచనాలు

క్రోసూరు: స్థానిక బీసీ, ఎస్సీ కాలనీ ప్రజల విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. ప్రధాన 11 కేవీ లైన్ ఇళ్ల మీదగా వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృత్యువాత కూడా పడ్డారు. సమస్య తీవ్రత గురించి పలుమార్లు అప్పటి అధికారులకు చెప్పినా, గత పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో సమస్య తీవ్రత గురించి ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ వాసులు ఎమ్మెల్యే నంబూరుశంకరరావు దృష్టి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి విద్యుత్ ఏఈతో మాట్లాడి, సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఏఈ బసవరాజు విడివిడిగా లైన్లు వేసేందుకు శనివారం అంచనాలు పూర్తి చేశారు. లైను వేయాల్సిన ప్రాంతాన్ని వైఎస్సార్ సీపీ నేతలతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి గార్లపాటి దాసు, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, దుగ్గి ప్రభుదాసు, చిల్కా భాస్కరరావు, అడితి ముస్తఫా, కాలనీవాసులు పాల్గొన్నారు.



లైను వేయాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఈ బసవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఏ విద్యార్థికి స్నేహ హస్తాలు వితరణ

అచ్చంపేట: సీఏ చదువుతున్న అచ్చంపేటకు చెందిన నందమూడి తరుణ్‌కు స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.30,000 చెక్కును శనివారం అందచేశారు. సంస్థ ప్రతినిధి మామిళ్లపల్లి విజయలక్ష్మి నుంచి చెక్కు అందుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో చదివిన తరుణ్ 10వ తరగతిలో స్కూల్ ఫస్ట్ సాధించారు. ఎంట్రన్స్ ద్వారా విజయపురిసౌత్‌లోని ఏపీఆర్‌జేసీ కళాశాలలో సీటు సాధించాడు. అక్కడా ఇంటర్‌లో కాలేజీ ఫస్ట్ సాధించాడు. ప్రస్తుతం విజయవాడలోని ఎచీవర్స్ అకాడమీలో సీఏ చదువుతున్నాడు. హాస్టల్ ఫీజులకు ఇబ్బంది ఎదురవ్వడంతో స్నేహ హస్తాలు ప్రతినిధులు సాయమందించారు. ఈ సందర్భంగా సంస్థ కో– ఆర్డినేటర్ తాయి కరీముల్లా బాబు మాట్లాడుతూ సీఏ పూర్తయ్యేంత వరకు ఏటా హాస్టల్‌కు అయ్యే ఖర్చును తమ సంస్థ భరిస్తుందని చెప్పారు.

మల్లాది వెంకన్నకు చందనాలంకారం



అమరావతి: మండలంలోని మల్లాదిలో గల వట వృక్షాంతర్గత వెంకటేశ్వరస్వామికి శనివారం చందనాలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, అనంతరం పంచ సూక్తయుత పంచామృతస్నపన నిర్వహించారు. అనంతరం చందనాలంకారంతో పాటు స్వామిని పలు పుష్ప, తులసీమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకుడు వినుకొండ శ్రీనివాసాచార్యులు సహస్రనామార్చన, నక్షత్ర హారతి, శాంతికళ్యాణం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



నకరికల్లు: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో శనివారం సాయంత్రం వ్యక్తి మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణకు చెందిన నలుగురు స్నేహితులు హైదరాబాద్ నుంచి కారులో బాపట్లకు బయలుదేరారు. మార్గంమధ్యలో నకరికల్లు సమీపంలోని చల్లగుండ్ల గోరంట్ల మేజర్ వద్ద ఆగిఉన్న లారీని కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఘటనలో కారు నుజ్జునుజ్జుకావడంతో అందులో నలుగురికి గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఇందులో యర్రబాబు సాయికిషన్ (24) పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు సిద్దిపేట సమీపంలోని చేపర్తి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

పలు పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు ప్రదానం



అచ్చంపేట హైస్కూలులో విద్యార్థులతో ఉపాధ్యాయులు, నాయకులు



మల్లాది జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నరసింహారావు

అచ్చంపేట: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని భావించి సీఎం వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు గుత్తికొండ శివనాగసింధు, కావటి పూజిత, షేక్ షాహీనాలను శాలువాలతో సన్మానించి వరుసగా రూ.3,000, రూ.2,000, రూ. 1000తో పాటు గోల్డ్, రజత, కాంస్య పతకాలు, ప్రశంసాపత్రాల్ని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మెగిలి శ్రీనివాసరావు, కృష్ణా నాయక్, హెచ్ఎం చిగురుపాటి కల్యాణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆలపాటి సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరావతిలో..

మండలంలోని మల్లాది జెడ్పీ హైస్కూలులో శనివారం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో శనివారం సత్కరించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన కట్టా రామ్‌చరణ్‌తేజ, పట్టంశెట్టి నాగలక్ష్మి, మేకల శ్రీలేఖకు క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు నగదులతో పాటు ప్రశంసాపత్రాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వెంపా వాసు, ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రోసూరులో..



మోడల్ స్కూలులో విద్యార్థులను సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

స్థానిక ఏపీ మోడల్ స్కూలులో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 2022–23 సంవత్సరానికి పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం తరఫున నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెడల్స్ అందించి, ఘనంగా సత్కరించారు. ప్రథమ ర్యాంకు సాధించిన జి.లక్ష్మీ రత్నమాణిక్యానికి (576) రూ.3వేలు నగదు, ప్రశంసాపత్రం, గోల్డ్ మెడల్, ద్వితీయ ర్యాంకు సాధించిన కె.హీక్షితకు (567)కు రూ.2వేలు నగదు, ప్రశంసావత్రం, సిల్వర్ మెడల్ అందించారు. మూడో ర్యాంకు సాధించిన టి.వీరేంద్ర (566)కు రూ.వెయ్యి నగదు, ప్రశంసాపత్రం, కాంస్య మెడల్ ప్రదానం చేశారు. పాఠశాల వైస్ ప్రిన్స్‌పాల్ లూర్దు మేరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆర్.హనుమంతరావు, సీనియర్ ఉపాధ్యాయుడు సారీరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదలలో ఫ్యామిలీ పిజీషియన్ సేవలు

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదల–2 గ్రామ సచివాలయం పరిధిలో శనివారం ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు జయకృష్ణ 103 మందికి వైద్య సేవలందించారు. సాధారణ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందుల్ని అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. బాలింతలు, గర్భిణులు, పౌష్టికాహారం లోపంతో ఉన్న వారి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితుల్ని తెలుసుకొని, అవసరమైన వైద్యసేవలందించారు. కార్యక్రమంలో డీఈవో రవితేజ, సీహెచ్‌వో శాంతి, ఏఎన్ఎం నీరజ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండమోడులో 156 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని కొండమోడులో శనివారం ఫ్యామిలీ డాక్టర్ సేవల్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.రవితేజ నాయక్ 156 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల్ని పంపిణీ చేశారు. 26 మందికి బీపీ, 29 మందికి షుగర్ బిళ్లలను 15 రోజులకు సరిపడా అందించారు. అనంతరం సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. నలుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.ప్రియదర్శి, ఏఎన్ఎంలు శారద, రెహెనా, హెల్త్ అసిస్టెంట్ రాజు, డీఈవో చెవుల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైద్య సేవలు

సత్తెనపల్లి: ఫ్యామిలీ డాక్టర్ సేవల్లో భాగంగా మండలంలోని గోరంట్లలో శనివారం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి యు. శ్రీలక్ష్మీ కవిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో జనరల్ ఓపీ 36 మంది, హైపర్ టెన్షన్ 22 మంది, డయాబెటిస్ 40 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 20 మంది, గర్భిణులు తొమ్మిది మంది, బాలింతలు ముగ్గురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ పి.ఎం. మార్గరెట్, ఎంఎల్‌హెచ్‌పీ ఎల్జిబెత్, ఏఎన్ఎంలు వై.పాప, జె.సరోజకుమారి, హెల్త్ అసిస్టెంట్ జె.బాబు, డీఈవో సుధాకర్, ఆశా కార్యకర్తలు ఎస్.సీత, డి. రత్నకుమారి, ఎం. అరుణ కుమారి, పి.కృష్ణకుమారి పాల్గొన్నారు.



మాదలలో ఇంటి దగ్గరే వైద్యసేవలందిస్తున్న డాక్టర్ జయకృష్ణ

- సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో శనివారం వైద్యాధికారిణి గౌతమి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా 263 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో జనరల్ ఓపీ 15 మంది, హైపర్ టెన్షన్ 88 మంది, డయాబెటిస్ 51 మంది, గర్భిణులు 24 మంది, బాలింతలు 10 మంది, చిన్నారులు ముగ్గురు, ఎనీమియా బాధితులు నలుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసి సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, పాఠశాలల్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్(ఎఫ్) జె.సంపూర్ణాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ డి.వైశాలి, ఎంపీహెచ్ఏ(ఎఫ్) సీహెచ్. శారదా దేవి, హెల్త్ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు, డీఈవో జి. ఇజ్రాయిల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు కార్డులతో యజమానులకు నష్టం లేదు

రాజుపాలెం: కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వడం వల్ల భూ యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లదని డీబీఆర్‌సీ జిల్లా ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ బి.రమణమూర్తి తెలిపారు. మండలంలో గణపవరం , బలిజేపల్లి ఆర్‌బీకేలలో ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులంతా సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కార్డుల వల్ల పలు ఉపయోగాలున్నాయని చెప్పారు. ఏరియా కో–ఆర్డినేటర్ బి. కోటిరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని కౌలు రైతులంతా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో హుస్సేన్, మాజీ సర్పంచ్ గన్నుపల్లి వెంకటరమణ బుల్లిబాబు, గ్రామ మహిళా పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య

క్రోసూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. క్రోసూరు సచివాలయం –2 పరిధిలోని 2,4,5,6,7 అంగన్‌వాడీ కేందాల్లో శనివారం జన్ భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్య గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఆటపాటలతో కూడిన విద్య గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.మాధవి, మెడికల్ అధికారి బాల అంకమ్మబాయి, వెల్ఫేర్ సెక్రటరీ పాల్గొన్నారు.



పాకాలపాడులో మస్టర్ తనిఖీ చేస్తున్న ఏపీడీ వెంకటనారాయణ



రెంటపాళ్లలో పనులు

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు సత్తెనపల్లి మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని 24 గ్రామాల్లో శనివారం 8,565 మంది కూలీలు పనులకు హాజరై పనులు చేపట్టారు. పాకాలపాడులో ఫీడర్ చానల్ పనులు చేస్తున్న కూలీల మస్టర్‌ను ఏపీడీ పి.వెంకట నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ఊపందుకోవడంతో వలసలకు చెక్ పడింది. సత్తెనపల్లి



నందిగామలో పనులు చేస్తున్న కూలీలు



గండ్లూరులో పనులు చేస్తున్న కూలీలు



దీపాలదిన్నెపాలెంలో కెనాల్ పనులు చేస్తున్న కూలీలు